క్లుప్తంగా

గ్రామాల్లో డీఎల్పీవో పర్యటన



ధూళికట్టలో నర్సరీ పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట, ముప్పిరితోట గ్రామాల్లో డీఎల్పీవో వేణుగోపాల్ పర్యటించి, పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం తీరును, శానిటేషన్ పనులు, ఆయా గ్రామ పంచాయతీల రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస మూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, సర్పంచులు గొల్లె కావేరి, పెద్దోళ్ల ఐలయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సహకరించాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

సుల్తానాబాద్: పట్టణం పరిశుభ్రంగా ఉండడానికి పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ కోరారు. శుక్రవారం పట్టణంలోని ఒకటో వార్డు శ్రీరాములపల్లిలో కౌన్సిలర్ మమతతో కలసి పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో మురికి కాలువల్లో సిల్ట్ పూర్తిగా తొలగించాలని, బహిరంగ ప్రదేశాలలో చెత్తను పారవేయకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు సంపత్ సిబ్బంది శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్

పెద్దపల్లిరూరల్: పట్టణంలో నిర్మిస్తున్న పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయం కొత్త భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రాలు అందించారు. మున్సిపల్ సమావేశంలో తీర్మానించాలని కోరారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

మంథని: జయశంకర్ భూపాలపల్లి జిల్లా జేపీ కాటారం, గారెపల్లి గ్రామానికి చెందిన సుమారు వంద మంది శుక్రవారం మంథనిలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. బీజేపీ నాయకుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై అనేక మంది బీజేపీలో వస్తున్నట్లు సునీల్ తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో–కన్వీనర్ నాంపల్లి రమేశ్, కాటారం మండలాధ్యక్షుడు బొమ్మన భాస్కర్ రెడ్డి, నాయకులు పూసల రాజేంద్రప్రసాద్, బోయిని నారాయణ, బోగోజు శ్రీనివాస్, కోరబోయిన మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

జూలపల్లి: రైతులు తమ పంటలు కోసిన తరువాత మిగిలిన కొయ్య కాళ్లను కాల్చివేయొద్దని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష అన్నారు. జూలపల్లిలో అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా వరి పొలాల్లో పంటల అవశేషాలను తగులపెట్టడం వలన, బ్యాక్టీరియా,శిలీంద్రాలు నాశనమై, భూమిపై ఉండే తేమ కోల్పోయి, భూసారం దెబ్బతింటుందని వివరించారు. రైతులు పొగ మూలంగా అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. దుక్కి దున్నిన తరువాత సూపర్ ఫాస్ఫేట్ చల్లితే వారంలో మురిగిపోయి సేంద్రియ ఎరువుగా మారి దిగుబడులు పెరుగుతాయని వివరించారు. రైతులు తమ పొలాల్లో వరి కొయ్యలను కాల్చొద్దని, భూసారం పెంపుపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు.

తొలగనున్న ఇరుకు రోడ్ల ఇక్కట్లు

- రోడ్ల విస్తరణకు రూ.6.43 కోట్ల నిధులు మంజూరు
- తీరనున్న వాహనదారుల అవస్థలు



సుల్తానాబాద్ పట్టణంలో ఇరుకు రోడ్డు నుంచి వస్తున్న వాహనం

సుల్తానాబాద్: పట్టణవాసులు, వాహనదారులకు ఇరుకురోడ్ల బాధలు తీరనున్నాయి. సుల్తానాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్‌గా మారడంతో జనాభాకు అనుగుణంగా రోడ్లను విస్తరించాలని పాలకవర్గం భావించింది. రోడ్డు విస్తరణ చేయడం వల్ల ప్రజలకు, రవాణా సౌకర్యాలకు ఇబ్బందులు కలగవని, ప్రమాదాల నివారణకు తోడ్పడుతుందని భావించి పట్టణ సుందరీకరణలో భాగంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నిధులు మంజూరు చేయించారు. ఇప్పటికే పట్టణం నుంచి పూసల రోడ్డు పనులు ప్రారంభం కాగా, పూసల చెరువు వరకు జరగాల్సి ఉంది. పట్టణం నుంచి నీరుకుల్లకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఊర చెరువు నుంచి సుల్తానాబాద్ ఎంపీడీవో కార్యాలయం వరకు రోడ్ల విస్తరణకు నిధులు మంజూరయ్యాయి.

రెండు వాహనాలు ఎదురుగా వస్తే ఇబ్బందులు

సుల్తానాబాద్ పట్టణంలో రోడ్లు ఇరుకుగా ఉండడంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నిధులు మంజూరు చేయించారు.

రోడ్ల విస్తరణతో ప్రజలకు మేలు

భవిష్యత్తు అవసరాల కోసం రోడ్ల విస్తరణ చేపట్టడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని అధికారులు, మేధావులు తెలుపుతున్నారు. దీంతో పట్టణీకరణ జరిగి, వ్యాపారాలు పట్టణం మొత్తం విస్తరించేందుకు దోహదపడుతుందని భావిస్తున్నారు. చెరువు నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు రూ. 8 లక్షలు రహదారికి, డ్రెయినేజీకి రూ.31 లక్షలు, పూసల చెరువు వరకు రూ.2 కోట్లు, డ్రెయినేజీలకు రూ. 54 లక్షలు, సుల్తానాబాద్ నుంచి గట్టెపల్లి రహదారికి రూ.2.5కోట్లు, సుల్తానాబాద్ నుంచి నీరుకుల్లకు రూ.6 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తే పట్టణం అభివృద్ధి జరిగే అవకాశాలు ఉన్నాయి.

వ్యాపారమంతా మూడువీధులలోనే

పట్టణంలో వ్యాపారమంతా మూడు వీధుల్లోనే జరుగుతుంది. రాజీవ్ రహదారి వెంబడి, కాల్వ శ్రీరాంపూర్ రోడ్డు, పోలీస్ స్టేషన్ వీధుల వెంబడి మాత్రమే వ్యాపారం జరుగుతోంది. ముఖ్య వీధులు విస్తరణ చేపడితే వ్యాపారాలు పట్టణమంతా విస్తరించే అవకాశం ఉందని, దీనికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

అభివృద్ధికి ప్రజలు సహకరించాలి



మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ గా మారింది. పెరుగుతున్న పట్టణీకరణకు తగ్గట్టుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నిధులు మంజూరు చేశారు. టెండర్ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. మరికొన్ని ప్రారంభించాల్సి ఉంది. దీనికి అందరూ అన్ని రాజకీయ పార్టీలు, వ్యాపారులు, ప్రజలు సహకరించాలి.

– ముత్యం సునీత, మున్సిపల్ చైర్ పర్సన్, సుల్తానాబాద్

భవిష్యత్తు కోసం రోడ్ల విస్తరణ అవసరమే



భవిష్యత్ తరాల కోసం రోడ్ల విస్తరణ అవసరమే. దానికి ప్రజలు ఇంటి యజమానులు సహకరించాలి. ఇల్లు కోల్పోకుండా రోడ్డు వెడల్పు చేయాల్సి ఉంది. నిరుపేదల ఇల్లు కోల్పోతే ప్రత్యామ్నాయంగా అధికారులు ఆలోచించాలి. వారికి తగు పరిహారం అందించాలి.

– సూర శ్యామ్, విద్యార్థి జేఏసీ జిల్లా కో కన్వీనర్, సుల్తానాబాద్

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర

- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



కల్యాణ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దాసరి

కాల్వశ్రీరాంపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రైతులను కోరారు. సింగిల్‌విండో నేతృత్వంలో శుక్రవారం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, సింగిల్‌విండో చైర్మన్లు రాంచంద్రా రెడ్డి, పురుషోత్తం, సర్పంచులు శ్రీదేవి, రవీందర్ రెడ్డి, సీఈవో కోలేటి శ్రీనివాస్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వరుని కల్యాణానికి ఏర్పాట్లు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఆదివారం జరిగే శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవానికి భారీగా ఏర్పాట్లు సాగుతున్నాయి. శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి స్వామివారి ప్రతిమలతో పాటు అర్చకబృందం వస్తోందని వివరించారు. కన్నుల పండువగా సాగే ఈ కల్యాణ ఉత్సవానికి భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. తప్పనిసరిగా సంప్రదాయ వస్త్రాలనే ధరించి రావాలన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణానికి తరలిరావాలి

కాల్వశ్రీరాంపూర్: జిల్లా కేంద్రంలో ఈనెల 30న ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి కోరారు. శుక్రవారం కళ్యాణ మహోత్సవం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చదువు రాంచంద్రా రెడ్డి, సర్పంచు ఆడెపు శ్రీదేవి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష , తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ దినోత్సవం



అంగన్‌వాడీలో స్కూల్ మెటీరియల్ ప్రదర్శన

ఎలిగేడు: మండలంలోని నర్సాపూర్, ర్యాకల్‌దేవుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రిస్కూల్ లర్నింగ్ మెటీరియల్ ప్రదర్శించారు. 3 ఏళ్లు, 4 ఏళ్ల పిల్లలకు అసైన్‌మెంట్ ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, సర్పంచులు విజయేందర్‌రెడ్డి, తంగెళ్ల స్వప్న, ఉపసర్పంచ్ అనిల్‌గౌడ్, అంగన్‌వాడీటీచర్లు ఓదేశ్వరి, సూర్యకళ, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న వేణుగోపాల్‌రావు

ఎలిగేడు: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ స్రవంతి, ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు అన్నారు. శుక్రవారం ధూళికట్ట, ముప్పిరితోట, లోకపేట, నేతకానిపల్లి, ముప్పిరితోట,బుర్హాన్‌మియాపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయసమితి మండల కో ఆర్డినేటర్ నరినేని సుదాకర్‌రావు, సర్పంచులు గొల్లె కావేరి, పెద్దోళ్ల ఐలయ్య, దేవరనేని ప్రభావతి, రాచర్ల కొండయ్య, ఏపీఎం సుదాకర్, విండో సీఈవో రవీందర్ రెడ్డి, సీసీలు సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు ధర

మంథని: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మంథని మండలం చిన్న ఓదాల, స్వర్ణపల్లి, అడవిసోమన్‌పల్లి, మల్లారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నామని చెప్పారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్న క్రమంలో సెంటర్ ఇన్‌చార్జీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సీఈవో మామిడాల అశోక్‌కుమార్, సంఘం డైరెక్టర్లు, గ్రామ సర్పంచ్‌లు,తదితరులు ఉన్నారు.

ఫొటోగ్రఫీలో కొలనూరు వాసికి అవార్డు

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన ముత్యం ఫొటో గ్రాఫర్ హైదరాబాద్‌లో నిర్వహించిన సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ పోటీల్లో రాణించి గ్రాండ్ ప్రోగ్రెస్ అవార్డును కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లో సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సాలార్‌జంగ్ మ్యూజియంలో పోటీలు గురువారం జరిగాయి. ఇందులో ముత్యం తీసిన ఛాయా చిత్రాలు అవార్డుకు ఎంపికయ్యాయి. సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి అవార్డును ముత్యంకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిగ్మా అకాడమీ చైర్మన్ ఎంపీ శేఖర్, కార్యదర్శి జనార్దన్ ,ఫొటోగ్రఫీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులకు గుణపాఠం తప్పదు

జ్యోతినగర్: అక్రమ భూదందాకు అడ్డు వస్తున్నారని పేదల గుడిసెలు తగులబెట్టడం సరైన చర్య కాదని, భూకబ్జాదారులు తమ పద్ధతి మార్చుకోకుంటే ప్రజలచే గుణపాఠం తప్పదని సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి అన్నారు. రామగుండం కార్పొరేషన్ ఇందిరమ్మ కాలనీలో 40రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాల కేటాయింపు కోసం చేస్తున్న భూపోరాట శిబిరం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భూమిని కబ్జా చేసి లక్షల్లో ఆర్జించే ప్రణాళికకు అడ్డు వస్తున్నారని పేదల గుడిసెలు పీకడం, భయపెట్టేలా గురువారం రాత్రి గుడిసెలకు నిప్పు అంటించడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. నాయకులు భిక్షపతి, రమణ, సంపత్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికులకు సేఫ్టీ మోకులు అందజేయాలి

సుల్తానాబాద్: ప్రమాదాల నివారణకు గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సేఫ్టీ మోకులను అందించేలా చూడాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజిగౌడ్ శుక్రవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను కలిసి విన్నవించారు. సీఎం కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. రెండేళ్ల క్రితం గీతకార్మికులకు ద్విచక్ర వాహనాలు పంపిణీ చేస్తామని ఎక్సైజ్ అధికారులు వివరాలు సేకరించారని ఇప్పటివరకు పంపిణీ చేయలేదని, వాటిని వందశాతం సబ్సిడీతో అర్హులకు అందజేయాలని కోరారు. జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి భరత్ ప్రసాద్‌గౌడ్ ఉన్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

గోదావరిఖని: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లెనిన్‌నగర్‌కు చెందిన దైత కళ్యాణి(20) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై వన్‌టౌన్ ఎస్సై స్వామిని వివరణ కోరగా కుటుంబ సభ్యులు అందుబాటులో లేరని, దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

నాణ్యతా లోపంతో కూలిన సైడ్ డ్రెయినేజీ



కూలిపోయిన సైడ్ డ్రెయినేజీ

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సైడ్ డ్రెయినేజీ నాణ్యతా లోపంతో గురువారం కూలిపోయింది. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడంతో నిర్మాణం చేపట్టి పది రోజులు గడవకుండానే నాణ్యత లోపాలు వెలుగు చూశాయి. సైడ్ డ్రెయినేజీ నిర్మాణంపై ఉన్నత అధికారుడు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

'గాయత్రీ'లో క్లాసిక్ ఫేర్‌వెల్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థుల క్లాసిక్ ఫేర్‌వెల్ డే శుక్రవారం నిర్వహించారు. ఉన్నత విద్యను చదివే వారంతా తమ ఎంచుకున్న లక్ష్యాలను సాధించి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ అన్నారు.డిగ్రీ సెకండియర్‌కు చెందిన అరవింద్ అనే విద్యార్థి రూపొందించిన వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఫలితాల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు బహుమతులను అందించారు. ప్రముఖ యాంకర్ మహేశ్‌రాజు విద్యార్థులను ఉత్తేజపరిచారు. విద్యార్థినులు ఇచ్చిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్, సురేశ్, రజనీతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న కార్యదర్శులు



రామగుండం: చిన్నారితో కలిసి తల్లి నిరసన

పంచాయతీ కార్యదర్శుల నిరసన దీక్ష

తమ ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం సమ్మె బాట పట్టారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం, రామగుండం, మంథని, సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, పాలకుర్తి, ఓదెల, కమాన్‌పూర్, రామగిరి, మండల కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపట్టారు. ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయి నాలుగైళ్లయినా ఇప్పటివరకు తమను రెగ్యులర్ చేయలేదని, వెంటనే రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమ్మె హక్కుగా కాదు.. ఆవేదనతో చేస్తున్నామని నినదించారు. కార్యదర్శులకు వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. రామగుండంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా రాగూర్ మక్కాన్‌సింగ్ మద్దతు తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కార్యదర్శులు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. మండల కేంద్రాల్లో ఎంపీడీవోలకు, ఎంపీవోలకు వినతి పత్రాలు సమర్పించారు. నిరసనల్లో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

మౌలిక వసతుల కల్పనకు కృషి



డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ ప్రజలకు కనీస మౌలిక వసతులను కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో రూ.7.53 లక్షల వ్యయ అంచనాలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను కౌన్సిలర్ ఉప్పు స్వరూపతో కలిసి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. పట్టణాన్ని స్వచ్ఛ పెద్దపల్లిగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరిస్తున్నారన్నారు. నాయకులు ఉప్పురాజు, ఫహీం, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఏఈ సతీశ్, అనిల్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

41 అంశాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎజెండాలో ప్రవేశపెట్టిన 41 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని చైర్‌పర్సన్ మమతారెడ్డి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ నాజ్మీన్ సుల్తానా, మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మమతారెడ్డి కోరారు. పెద్దపల్లిలోని ఎల్లమ్మ చెరువువద్దగల ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని శుక్రవారం కౌన్సిలర్ పోతని పురుషోత్తంతో కలిసి ప్రారంభించారు.

మాయావతి సభ విజయవంతం చేయాలి



పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న దాసరి ఉష

కాల్వశ్రీరాంపూర్: బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఈనెల 7న హైదరాబాద్ తెలంగాణ భరోసా సభకు రానున్న దృష్ట్యా పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష పిలుపునిచ్చారు. మండలంలోని లక్ష్మీపురంలో శుక్రవారం పలువురు గ్రామస్తులు వివిధ పార్టీలకు చెందిన వారు బీఎస్పీలో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మహేశ్, సుదర్శన్ రెడ్డి, లింగయ్య, ఓదెలు, చేరాలు, ఓదెలు, కుమార్, మురళి, కొమురయ్య, భూంరెడ్డి తదితరులు ఉన్నారు.కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు కుమ్మరికుంట రవికుమార్, మహిళా కన్వీనర్ శారద, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రామగుండం: అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామానికి చెందిన కేబుల్ ఆపరేటర్ సముద్రాల రమణయ్య కూతురు మానస మూడు నెలలుగా నరాల సంబంధ వ్యాధితో బాధపడుతోంది. మండల కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు తలా కొంత జమ చేసిరూ.26 వేల ఆర్థికసాయం అందజేశారు. రమణయ్యకు ఎవరైనా ఆర్థిక సాయం అందించి కుటుంబానికి భరోసా కల్పించే దాతలు సెల్ నెం.9700333385 ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా నగదు పంపించాలని కోరారు. కార్యక్రమంలో సిటికేబుల్ ఎండీ. ఇంజపురి పులేందర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా దివ్య ప్రబంధ సేవాకాలం

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుక్కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ఉదయం, సాయంత్రం దివ్యప్రబంధ సేవాకాలం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యుల ఆచార్యత్వమున కన్నుల పండువగా నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారికి రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని పాత శివాలయంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి శేష వస్త్రాన్ని అందించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను పూజారులు మహేశ్, రమేశ్ అందజేశారు.కార్యక్రమంలో ఒళ్లాల రాజు –వాణి, తిరుపతిరావు–సుజాత, తోర్రి కొండ ప్రభాకర్– రమ దంపతులు పాల్గొన్నారు

తాజొద్దీన్ బాబా ఉర్సు ఉత్సవం ప్రారంభం

గోదావరిఖనిటౌన్: నాగపూర్ తాజొద్దీన్ బాబా ఉర్సు సందర్భంగా సప్తగిరి కాలనీలోని ఆశ్రమ వ్యవస్థాపకుడు, ట్రస్ట్ చైర్మన్ శ్రీ రెడ్డి బాబా మొదటి రోజు జెండా కార్యక్రమం, ఉర్సు ఉత్సవాన్ని ప్రారంభించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, చివరి రోజు సందల్ ఊరేగింపు నిర్వహిస్తామని శ్రీరెడ్డి బాబా తెలిపారు.

నేడు ఎలిగేడులో సివిల్‌రైట్స్ డే

ఎలిగేడు: ఎలిగేడు మండల కేంద్రంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజమ్మ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అలరించిన లేడీస్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం



నృత్యం చేస్తున్న మహిళలు

గోదావరిఖని: రామగుండం రీజియన్ లేడీస్‌క్లబ్ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఆకట్టుకుంది. రీజియన్‌లోని లేడీస్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం స్థానిక ఇల్లెందు క్లబ్‌లో కన్నుల పండువగా జరిగింది. ఆర్జీ–1,2,3 ఏరియా లేడీస్ క్లబ్‌కు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆడి,పాడి ఆనందంగా గడిపారు. సింగరేణి డైరెక్టర్ల సతీమణులు హరిణి, శారద, కల్యాణి, సునీత జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో లేడీస్‌క్లబ్ అధ్యక్షురాళ్లు చింతల లక్ష్మి, సవిత, శ్రీదేవి, విజయ, క్లబ్ మెంబర్లు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.